క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థునులు సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రంగప్ప, పీఈటీ మహేష్ తెలిపారు. బుధవారం అనంతపురం జిల్లా ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తమ విద్యార్థునుల ప్రతిభ చూపడంతో అండర్-14 బాలికల సాఫ్ట్‌బాల్ విభాగం క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 18, 19, 20న గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నట్లు తెలిపారు. ఎంపికైన సుకన్య, హిందూ, సాయిరామాచారిని ఉపాధ్యాయులు అభినందించారు.

సామూహిక వివాహాలకు పేర్లు నమోదు చేసుకోండి

హిందూపురం: సత్యసాయిబాబా 98వ జన్మదినాన్ని పురస్కరించుకుని హిందూపురం సత్యసాయి సేవా సమితి ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు పాండురంగనగర్ సాయిసాధన్ సమితి సభ్యులు తెలిపారు. డిసెంబర్ 17న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన జంటలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సెల్ నంబర్లు 7660022285, 9490856491, 9290075019 ద్వారా పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

నిబంధనలు పాటించాలి



లాటరీ ద్వారా షాపు నంబర్లను కేటాయిస్తున్న అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, ఫైర్ అధికారి ప్రభాకర్ టపాసుల దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో దుకాణాల ఏర్పాటు కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. లాటరీ పద్ధతి ద్వారా షాపు నంబర్లను కేటాయించారు. అధికారులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



ప్రమాదానికి గురైన కారు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై అమ్మవారిపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఓ కారును గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో కారు పాక్షికంగా దెబ్బతింది. అయితే బాధితులు సమీపంలోని ఏ ఆస్పత్రికి వెళ్లలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన కారును కియా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా కారులో డీజిల్ సరఫరా చేసే సామగ్రి ఉండటంతో వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

హిందూపురం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ జగనన్న ప్రభుత్వం ముందుకు సాగుతోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 17, 28వ వార్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన వార్డు కౌన్సిలర్లు జె.మల్లికార్జున, మాజిన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్, కమిషనర్ మాట్లాడారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. అనంతరం వైద్యశిబిరంలో వివిధ విభాగ వైద్యులు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించారు.

వచ్చీరాని వైద్యంతో సయాటికా

పెనుకొండ పట్టణానికి చెందిన హిమజ ఓ ప్రైవేటు క్లీనిక్‌కు వెళ్లారు. ప్రసవానంతరం నొప్పులు అధికంగా ఉన్నాయని వైద్యునికి చెప్పారు. ఆయన ఇంజెక్షన్లు వేయించుకోవాలని సూచించడంతో సరేనన్నారు. అయితే అక్కడ పనిచేస్తున్న నర్సుకు ఇంజెక్షన్ చేయడంపై సరైన అవగాహన లేకపోవడంతో నడుము కింద భాగంలో ఆమెకొచ్చిన రీతిలో ఇంజెక్షన్ చేశారు. సయాటిక నర్వ్ ఒత్తిడికి గురి కావడంతో ఆమె ఇప్పుడు సయాటిక బారిన పడ్డారు. ఎక్కువ దూరం నడవలేక, ఎక్కువ సేపు కూర్చోలేక అవస్థ పడుతున్నారు. కొద్దిరోజుల తర్వాత మరో ఆస్పత్రికి వెళ్లి అన్ని పరీక్షలు చేయించుకోగా అసలు విషయం బయట పడింది. హిమజనే కాదు జిల్లా వ్యాప్తంగా చాలా మంది వచ్చీరాని వైద్యం చేయించుకుంటూ సయాటికా బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ఉన్న జబ్బు పోగొట్టుకుందమని వైద్యం కోసం వెళితే కొత్త రోగాన్ని తగిలిస్తున్నారు కొందరు వైద్య సిబ్బంది. వచ్చీరాని వైద్యంతో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. కనీసం పదో తరగతి కూడా పాస్ కాని వారితో ఇంజెక్షన్లు చేయిస్తూ సయాటికా లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడేలా చేస్తున్నారు.

- కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న ప్రైవేటు, ఆర్‌ఎంపీ క్లినిక్‌లు
- అనుమతులు లేకుండానే వైద్యం
- చాలాచోట్ల ఆన్‌ట్రైన్డ్ వైద్యసిబ్బందితో పనులు
- ఇష్టానుసారంగా ఇంజెక్షన్ల చేస్తుండటం చిక్కులు
- ఉన్న రోగం కోసం వెళితే కొత్తరోగం అంటిస్తున్న వైనం

పెనుకొండ రూరల్: వైద్యో నారాయణ హరి.. తల్లిదండ్రులు జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మనిస్తారు. అందుకే వారిని దేవుళ్లతో పోలుస్తారు. అయితే రాను రాను కొందరు వైద్యులు ధనార్జనే ధ్యేయంగా వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారు. బేరం లేని వ్యాపారం ఏదైనా ఉందదంటే అది వైద్యమనే చెప్పవచ్చు. ఇందులో భాగంగానే జిల్లాలో పెద్ద ఎత్తున ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఆర్‌ఎంపీ వైద్యశాలలు కూడా వెలిశాయి. క్లినిక్‌లలో అర్హత, నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బందిని నియమించుకోవడం కూడా చాలా ముఖ్యమే. అయితే కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు పదో తరగతి పూర్తికాని వారిని నియమించుకొని ప్రజల ఆరోగ్యాలతో ఆటాడుకుంటున్నారు.

200పైకా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు

పెనుకొండ డివిజన్ పరిధిలోని పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో ప్రైవేటు ఆస్పత్రులు 70 వరకూ ఉన్నాయి. అలాగే 200కు పైగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. వీటిలోనూ కొన్ని ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగతా వారంతా అనధికారికంగానే వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులోని చాలా ఆస్పత్రుల్లో అన్‌ట్రైన్డ్ సిబ్బంది వైద్యం చేస్తున్నారు. కనీసం పదో తరగతి పూర్తికాని వారిని కూడా కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు అరకొర వైద్యం నేర్పించి రంగంలోకి దింపేస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో కేవలం ప్రాథమిక వైద్యసేవలే అందించాల్సి ఉన్నా కొందరు ఏకంగా పడక గదులు ఏర్పాటు చేసుకొని సెలైన్లు, ఇష్టానుసారంగా ఇంజెక్షన్లు వేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. దీన్ని బలపరిచేలా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే ఎన్నో ఘటనలు చోటు చేసుకున్నారు. పలువురు మృతి కూడా చెందడంతో ఆయా ప్రాంతాల్లో బాధితులు ఆందోళనలు కూడా చేశారు.

వందలో 13 మందికి...

ఇటీవలి కాలంలో సయాటికా కేసులు అత్యధికంగా నమోదు అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి వంద మందిలో 13 మంది సయాటికాతో బాధపడుతున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి.

వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ వైద్యానికి పెద్ద పీట వేసింది. ప్రతి పంచాయతీకి ఒక సచివాలయం నర్సుతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అక్కడ వైద్యసేవలు అందించేందుకు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ను నియమించి ప్రజలకు ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోంది. 64 రకాల మందులను కూడా అందుబాటులో ఉంచింది. అయినా చాలా మందికి అవగాహన లేకపోవడంతో ప్రైవేటు, ఆర్‌ఎంపీల బాట పడుతున్నారు.



సయాటికా అంటే..

మనం తీసుకొనే ఆహారపు అలవాట్లతో పాటు గంటలు తరబడి కూర్చొని పనిచేయడం, నిల్చొని పనిచేయడం వల్ల సయాటికా నర్వ్ ఒత్తిడికి గురవుతుంది. దీంతో సయాటికా వ్యాపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీనికి తోడు కొన్ని ఆస్పత్రుల్లో నడుము కింద భాగంలో ఇంజక్షన్ ఇచ్చే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో సయాటిక నర్వ్‌కు చిల్లుపడినప్పుడు స్వల్పంగా రక్తం సరఫరాకు అంతరాయం ఏర్పడి సయాటికా వస్తోందని చెబుతున్నారు. నడుమ కింది భాగం నుంచి పిక్కలు మీదగా పాదాలు వరకు ఒత్తిడికి గురైనప్పుడు భరించలేని నొప్పి వస్తుందంటున్నారు. దీర్ఘకాలంగా దీనికి చికిత్స చేయించుకోవాల్సిందేనని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



సయాటికా ప్రాణాంతం కాకపోయినా మనిషిని అన్నిరకాలుగా కట్టిపడేసి ఇబ్బంది పెడుతుంది. ఎక్కువ దూరం నడవలేక పోవడం, ఎక్కువ సేపు కూర్చోలేక పోవడం వంటి ఇబ్బందులు తరుచుగా ఏర్పడతాయి. ఆహారపు అలవాట్లు వలన మాత్రమే కాకుండా, గంటల తరబడి కుర్చోని చేసే పనుల వల్ల కూడా సయాటికా వచ్చే అవకాశం ఉంది. నడుమ భాగంలో ఇంజెక్షన్లు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం వలన సయాటిక నర్వ్ ఒత్తిడికి గురై కూడా చాలా మంది సయాటిక బారిన పడుతున్నారు.

– నాగరాజు, ప్రభుత్వ వైద్యుడు, గుట్టూరు

ఫిర్యాదు చేస్తే చర్యలు



ఇంజెక్షన్లు ఇష్టానుసారం వేస్తున్నారని మాకైతే ఇంత వరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదు. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉన్న క్లినిక్‌లను మా సిబ్బంది తరచూ తనిఖీ చేస్తున్నారు. ట్రైన్డ్ వైద్య సిబ్బందినే నియమించుకోవాలని కూడా చెబుతున్నాం. వైద్య సేవలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు చేపడతాం.

– ఎస్.వి కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్న దృశ్యం

సోమందేపల్లి: మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి సమావేశంలో సభ్యులు ప్రస్తావిస్తున్న సమస్యలను పరిష్కరించామా? లేదా? అన్న సమాధానం ఇవ్వడం లేదని కోఆప్షన్ సభ్యుడు రఫీక్, ఎంపీటీసీ నగప్ప, సర్పంచ్‌లు జిలాన్‌ఖాన్, పరంధామ తెలిపారు. ఐసీడీఎస్ శాఖకు సంబంధించి సీడీపీఓ కార్యాలయం స్థానికంగా ఉండగా సూపర్‌వైజర్ సమావేశానికి రాకుండా ఓ అంగన్వాడీ కార్యకర్తలను పంపి మాట్లాడిస్తే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు గైర్హాజరు అయితే గ్రామాల్లో సమస్యలు ఎవరితో చెప్పుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కలుగజేసుకొని సమావేశానికి గైర్హాజరు అయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



పీ బ్యాడేగేరలో అవగాహన కల్పిస్తున్న ఏఓ శేఖర్‌నాయక్

అగళి: రాగి పండించిన రైతులు ఇబ్బంది పడకుండా క్వింటా రూ.3,846 ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మండలంలో పీ బ్యాడిగేరలో రైతులకు అవగాహన కల్పించారు. రాగులు ఇచ్చిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సచివాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

- ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: దేశంలోనే కనీవిని ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన సచివాలయం-1, 2తో పాటూ రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవితో కలసి ఎమ్మెల్యే శంకరనారాయణ ప్రారంభించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయం-1 ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్మించిన సచివాలయం-2, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కష్టపడి పని చేసి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు.

టీడీపీని జనం నమ్మే పరిస్థితుల్లో లేరు

ఆదర్శంగా నిలిచిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాటు ఆర్బీకేలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేశాయని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. దాన్ని జీర్ణించుకోలేని టీడీపీ అధినేత చంద్రబాబు సచివాలయ వ్యవస్థలను తప్పుబడుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తామని టీడీపీ ప్రకటించడం దురదృష్టకరమన్నారు. టీడీపీ కుట్రలను ప్రజలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు.

రైతు భరోసా కార్యక్రమం గ్రాండ్ సక్సెస్

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మంగళవారం జరిగిన రైతు భరోసా నగదు జమ కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ సవిత, జెడ్పీటీసీ శ్రీరామప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, కోఆప్షన్ సభ్యుడు సలీం, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, వైస్ ఎంపీపీలు వేదవతి, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనులు సత్వరం ప్రారంభించాలి

హిందూపురం: పట్టణంలోని ప్రధాన రైల్వేరోడ్డు విస్తరణ పునరుద్ధరణ పనులు సత్వరం ప్రారంభించేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. ఇప్పటి వరకు రోడ్డు ఒకవైపు మాత్రమే కాలువ నిర్మాణ పనులు చేపట్టారని, మిగిలిన నిర్మాణ పనులు కూడా సత్వరం పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంలో నియోజకవర్గంలో రూ.60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.



రైల్వేరోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వర్షం ... రైతుల హర్షం

అమరాపురం: మండలంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల కింద ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు ఎంతో మేలు చేకూరిందని హనుమంతరాయప్ప, మంజునాథ, సిద్దప్ప, తదితరులు తెలిపారు. తమలపాకు, వక్కతోట, ఉల్లి, మొక్కజొన్న, రాగి తదితర పంటలకు ఎంతో మేలు చేకూరుతోందని రైతులు తెలిపారు.

మడకశిరరూరల్: మండలంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి మోస్తరు వర్షం పడుతుండడంతో వేరుశనగ పంట తొలగించుకోవడానికి ఇబ్బందిలేకుండా పోయిందన్నారు.

రొద్దం: మండల పరిధిలోని కలిపి, శేషాపురం, కె.మరువపల్లి, బూదిపల్లి గ్రామాల్లో వర్షానికి నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను బుధవారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. పంట పూర్తిగా నీట మునగడంతో రైతులకు నష్టం వాటిల్లిందని, నష్టాన్ని అంచనా వేసి అధికారులకు నివేదిక పంపుతామని ఏఓ నివేదిత చెప్పారు.



మడకశిర పట్టణంలో వాన పడుతున్న దృశ్యం

అసత్య ఆరోపణలు మానుకోవాలి



గుడిబండ: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడ్



అగళి: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



రొళ్ల: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహారెడ్డి

గుడిబండ: టీడీపీ నాయకులు నైతిక విలువ లేని మాటలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ హితవు పలికారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అగళి మండలం రావుడి పంచాయతీ కదిరేపల్లిలో ఓ యువతి ఎమ్మెల్యే తిప్పేస్వామిపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యగా టీడీపీ నాయకులతో కుమ్మక్కుతో ఆ యువతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అగళి: గత కొద్ది రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో తనతో పాటు ఎమ్మెల్యే తిప్పేస్వామిపైన రాజకీయ లబ్ధి కోసం కొంతమంది చేస్తున్న అసత్య ఆరోపణలు చేస్తున్నారని రావుడి ఎంపీటీసీ భర్త బసవరాజు, ఎంపీపీ భర్త కామరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలను పక్కనపెట్టి తప్పుడు ఆరోపణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

రొళ్ల: గ్రామాల్లో వ్యక్తిగత సమస్యలను వైఎస్సార్‌సీపీ పార్టీపై రుద్దడం టీడీపీ నాయకులు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మడకశిర మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ హితవు పలికారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకారుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అగళి మండలం రావుడి పంచాయతీ కదిరేపల్లి గ్రామంలో ఓ యువతి టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. దీనిపై టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్పందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సీఎం రవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలం రావుడి గ్రామ వలంటీర్ వ్యవహారంలో ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఎలాంటి సంబంధంలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేద అనే వలంటీర్‌తో లేనివి ఉన్నట్లుగా టీడీపీ నాయకులు చెప్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేపై చేసిన విమర్శలు నిజమని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, డీలర్లు శివకుమార్, నాయకులు ఉదుగూరు రాజప్ప, జేకే.నరసింహమూర్తి, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ త్రిలోక్‌నాథ్

కంచిసముద్రంలో వాల్మీకి జయంతి వేడుకలు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వాల్మీకి నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, రమేష్, శివశంకర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పట్టణంలోని ఒకటవ సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

మడకశిరరూరల్: 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం మండలంలోని గ్రామ సచివాలయల వద్ద ఈ నెల 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. 10న ఆమిదాలగొంది-1, 16న ఆమిదాలగొంది-2, 20న బుళ్లసముద్రం, 23న సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తామన్నారు.

11 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

గుడిబండ: మండలంలోని గుడిబండ-మద్దనకుంట మధ్యలోని క్రీడా మైదానంలో డా.బీఆర్ అంబేడ్కర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జీబీ కరుణాకర్‌గౌడు తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ జరుగుతోందన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి రూ.12 వేలు, రెండో బహుమతిగా రూ.6 వేలు నగదు బహుమతి, ట్రోఫీ అందిస్తామన్నారు. వివరాలకు మంజునాథ్, నరసింహప్ప సెల్‌నంబర్లు 8374147404, 7993488121 సంప్రదించాలని కోరారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మడకశిర: నియోజకవర్గంలో వివిధ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విద్యా సంస్థల బంద్ జరిగింది. కడపలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని, వైజాగ్‌లో స్టీల్ ఫ్యాక్టరీని పరిరక్షించాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్‌ఎఫ్ తదితర విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ జరిగింది. పట్టణంలోని అన్ని విద్యాసంస్థలను బంద్ చేయించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రవాణా సదుపాయం కల్పిస్తాం

హిందూపురం: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 11న మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగానే పురం నుంచి హైదరాబాద్ తరలివెళ్లేందుకు రవాణా సదుపాయం కల్పించాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డిని బుధవారం కోరారు. ప్రత్యేకంగా బస్సు సదుపాయం కల్పిస్తామని ఈమేరకు ఆయన హామీ ఇచ్చారు. రామ్మూర్తి, శ్రీరాములు, ఆనంద్, నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పథకంలో భాగంగా ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు.